సజావుగా ఎన్‌సీసీ ప్రాక్టికల్స్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 22:ఎన్‌సీసీ కెడేట్లకు శనివారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల మైదానంలో బీ సర్టిఫికెట్ కోసం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. నిజామాబాద్ రేంజ్ కమాండింగ్ అధికారి శర్మ సమక్షంలో ఈ పరీక్షలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి 256 మంది కెడేట్లు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యారు. మాక్ డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ హ్యాండ్లింగ్, డీఎస్టీ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం వారందరికీ థియరీ పరీక్షలు నిర్వహించనున్నారు. గతవారం సీ సర్టిఫికెట్ కోసం థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

జాబ్‌మేళాలో పాల్గొన్న విద్యార్థులు

డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

అందోల్, ఫిబ్రవరి 22: జోగిపేట నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. జాబ్‌మేళాకు 30 మంది హాజరుకాగా రాతపరీక్షలు, ముఖాముఖీ అనంతరం 18మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని చెప్పారు. వీరికి న్యూ ల్యాండ్ ఫార్మ కంపెనీ వారు వివిధ రంగాల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంధ్య, అధ్యాపకులు శ్రీకాంత్, సంయమి, దేవి పాల్గొన్నారు.

గురుకులంలో నేడు ప్రవేశ పరీక్ష

అందోల్, ఫిబ్రవరి 22: అందోల్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5,6,7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు ఆదివారం ఉదయం 11గంటలకు పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ లింగారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉదయం 10గంటల వరకు పాఠశాల వద్దకు చేరుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్, పరీక్ష రాసేందుకు అవసరమయ్యే సామగ్రి తెచ్చుకోవాలన్నారు.

పుస్తెమెట్టెలు బహూకరణ

గుమ్మడిదల, ఫిబ్రవరి 22: ఆడబిడ్డ వివాహానికి రాజిరెడ్డి బ్రదర్స్ పుస్తెమెట్టెలు బహూకరించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు వార్డుకు చెందిన అనితాకృష్ణయాదవ్ కూతురు వివాహానికి అదే వార్డుకు చెందిన నర్సంపల్లి రాజిరెడ్డి, నాగిరెడ్డి సోదరులు పుస్తెమెట్టెలను బహూకరించారు. పేద కుటుంబానికి చెందిన వారికి సాయం చేయడంతో సంతోషం ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

బాధితులను పరామర్శిస్తున్న భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కల్హేర్, ఫిబ్రవరి 22: కల్హేర్ మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాములు తండ్రి మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన కుమ్మరి రాములు రోడ్డు ప్రమాదంలో గాయపడగా బాధితుడి ఇంటికెళ్లి వివరాలు తెలుసుకొని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వీరి వెంట మాజీ జడ్పీటీసీ అలీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాములు, చాకలి పీరయ్య, హన్మాండ్లు మల్లేశం, యాదుల్లా, లక్ష్మగౌడ్ ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, ఫిబ్రవరి 22: నారాయణఖేడ్ మండల పరిధిలోని చల్లగిద్ద తండాకు చెందిన మీరాబాయి అనారోగ్యంతో ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందారు. ఈమేరకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.51వేల చెక్కును లబ్ధిదారుకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సర్దార్ నాయక్ ఉన్నారు.

నిందితులను శిక్షించాలి

సదాశివపేట, ఫిబ్రవరి 22:బాలికపై లైంగికదాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం సదాశివపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి పరిధిలోని ఫసల్‌వాది శివారులో ఎనిమిదేండ్ల బాలికపై లైంగికదాడి చేసిన నిందితులను దిశ చట్టం ప్రకారం ఎన్‌కౌంటర్ చేయాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటరాజ్యం, రమేశ్, శంకరప్ప, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

- పది పరీక్షలు జీవితంలో తొలిమెట్టు
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 22: పదో తరగతి పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా ధైర్యంగా ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యార్థులకు సూచించారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో ఉన్న కేజీబీవీ, వెలిమెలలో ఉన్న టీఎస్ మోడల్ స్కూళ్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, వంట గదులు, స్టోర్ రూంలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. టీచర్లు పాఠాలు ఎలా చెబుతున్నారు..టీచర్లు చెప్పిన పాఠాలు అర్థమవుతున్నాయా అని విద్యార్థులను ప్రశ్నించారు. ప్రతి సబ్జెక్ట్‌లో ఏవైనా సందేహాలు ఉంటే టీచర్లను అడిగి సందేహాలను నివృతి చేసుకోవాలని సూచించారు. టీచర్లను డౌట్స్ అడిగేందుకు బయపడవద్దని, పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని, పదిలో 10/10 గ్రేడ్ సాధించాలని విద్యార్థులకు సూచించారు. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే పదోతరగతి కీలకమని, పరీక్షలు అయ్యేంత వరకు దేనిపైన దృష్టి పెట్టకుండా బాగా చదువుకోవాలని విద్యార్థులకు తెలిపారు. పదిలో మంచి ఉత్తీర్ణతను సాధించేలా ప్రతిరోజూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పాఠశాలల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం విద్యార్థుల నోట్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. టీఎస్ మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థులకు వడ్డించే కూరలు రుచికరంగా లేదని, మెరుగుపర్చాలని స్కూల్ ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, ఎంఈవో పీపీరాథోడ్, ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లు కవిత, పద్మలత, టీచర్లు ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతన్న కలెక్టర్ క్రాంతి

ఝరాసంగం సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా..?

ఝరాసంగం, ఫిబ్రవరి 22: మండల పరిధిలోని కుప్పానగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు.ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని శనివారం ఝరాసంగం విద్యుత్ ఏఈని రైతులు నిలదీశారు. లక్షలు అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నామని, పంటలు చేతికందే సమాయంలో విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ రైతులు సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. తాము సాగు చేసిన పంటలు ఎండిపోతున్నయని విద్యుత్ అధికారులకు పలుమార్లు తెలియజేసినా పెడచెవిన పెట్టి, ఓ ప్రైవేట్ వెంచర్ యాజమాన్యం కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేశారని రైతులు మల్లికార్జున్ పాటిల్, మాణిక్‌రావు, శివన్న, పాండు, లాలప్ప, సంతోశ్‌పెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎప్పుడూ చూసినా ఏఈ విధులకు హాజరుకారన్నారు. సమస్యను పరిష్కరించకపోతే జిల్లా స్థాయిలో ధర్నా చేస్తామని రైతులు హెచ్చరించారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పొగాకుతో మనిషికి ప్రమాదం

కల్హేర్, ఫిబ్రవరి 22: పొగాకుతో తయారు చేసిన వస్తువులను వినియోగించడంతో ఆరోగ్యానికి హానికరమని పొగాకు వస్తువులకు ఎంత దూరం ఉంటే ఆరోగ్యానికి అంత మంచిదని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. జాతీయ పొగాకు నియంత్రణ దినోత్సవంతో భాగంగా కల్హేర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు మనిషి వాడడంతో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పొగాకు వల్ల జరిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, చుట్ట, సిగరేట్, జర్దా, తంబాకు, పాన్ మసాలా లాంటివి ఉపయోగించరాదన్నారు. వీటి వాడకం వల్ల మనుషుల్లో హైపర్ టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం సెక్షన్ 4 ప్రకారం నేరమని రూ.200 జరిమానా విధిస్తారని తెలిపారు. మాసాన్‌పల్లి పరిధిలోని దాబాలను సందర్శించి పొగాకు వాడకంపై పలు సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి అనిల్‌రెడ్డి, కళాశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులోకి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 22: భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్)లో 4జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ డీఆర్ రాజేశ్వరి వెల్లడించారు. శనివారం బైపాస్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో 9వ టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరైన సమావేశంలో బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు మాట్లాడుతూ త్వరలో బీఎస్ఎన్ఎల్ వైఫై, ఫ్రీ టీవీ చానల్స్ వంటి వినూత్న ఆఫర్లను తీసుకొస్తున్నదని వివరించారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ మిగతా నెట్‌వర్క్‌లు 5జీ దాటి 6జీగా అభివృద్ధిని సాధిస్తే బీఎస్ఎన్ఎల్ మాత్రం ఇంకా 4జీ సేవల్లోనే ఉన్నదని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని, సంస్థను లాభాల బాటలోకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో బీఎస్ఎన్ఎల్ ఏజీఎం శివప్రసాద్ పాల్గొన్నారు.

పీచెర్యాగడిలో లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చట్టాలపై అవగాహన ఉండాలి

జహీరాబాద్/కోహీర్, ఫిబ్రవరి 22: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ తెలిపారు. శనివారం జహీరాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాల, కోహీర్ మండలంలోని పీచెర్యాగడి పాఠశాల విద్యార్థులకు మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్, సమాచార హక్కు చట్టం, ఉచిత న్యాయసేవ సహాయంపై తెలియజేశారు. చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని తోటపల్లిలో గడ్డి మందు తాగి బోనాల శ్రీనివాస్(48)అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్ తరచూ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వరంగల్‌లోని దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

అందోల్, ఫిబ్రవరి 22: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అందోల్ డబుల్ బెడ్రూం కాలనీలో శనివారం జరిగింది. జోగిపేట ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రకారం..అందోల్‌లోని డబుల్ బెడ్రూం బీ బ్లాక్ 5 నంబర్‌లో తల్లి బాలమణితోపాటు మృతుడు సాయికుమార్(25) నివాసముంటున్నాడు. మూడు రోజుల క్రితం తల్లి బాలమణి కూతురు వద్దకు వెళ్లగా సాయికుమార్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. రెండు రోజులుగా తల్లి, సోదరి సాయికుమార్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. దీంతో పక్కన ఇంటి వారికి విషయం చెప్పి సాయికుమార్ కోసం ఆరా తీశారు. అనుమానంతో వారు ఇంటి కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. కుటుంబ సభ్యులతోపాటు పోలీసులుకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు రెండు రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుందన్నారు.

స్కూటీ హామీ నెరవేర్చాలని పోస్టుకార్డు ఉద్యమం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 22:విద్యార్థినులకు స్కూటీలు అందజేస్తామని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం నారాయణఖేడ్‌లో విద్యార్థినులు పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రేయారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థినులు వేర్ ఈజ్ మై స్కూటీ అని రాసి ఉన్న పోస్టు కార్డులను ప్రియాంకగాంధీకి పోస్టు చేశారు. ఈ సందర్భంగా శ్రేయారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినుల ఓట్ల కోసం అసత్య హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ తర్వాత హామీలను తుంగలో తొక్కుతుందన్నారు. నియోజకవర్గంలో పోస్టుకార్డుల ఉద్యమాన్ని ఉధృతం చేసి ఇచ్చినహామీ నెరవేర్చే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో అంజాగౌడ్, అశోక్‌రెడ్డి, మశ్చేందర్, ప్రశాంత్‌సాగర్, శంకర్‌నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, చింటూ నరేశ్, ప్రమోద్‌గౌడ్, లక్ష్మణ్‌నాయక్, భూమేశ్, గౌరీప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయకురాలు శ్రేయారెడ్డి

లక్ష్మీనరసింహా స్వామికి ప్రత్యేక పూజలు

జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

జిన్నారం, ఫిబ్రవరి 22: సోలక్‌పల్లి గ్రామంలోని లక్ష్మీ నరసింహాస్వామి జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి జాతరకు హాజరై లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. జాతర మహోత్సవ కమిటీ సభ్యులు కొలన్ బాల్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరలు మన సంస్కృతికి ప్రతిరూపాలన్నారు. లక్ష్మీ నరసింహాస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, బొల్లారం మాజీ కౌన్సిలర్ బీరప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

చౌటకూర్, ఫిబ్రవరి 22: చక్రియాల గ్రామంలో కేంద్ర ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు ఆ గ్రామ యువజన నాయకుడు చిన్నరోళ్లపాటి రాజశేఖర్ శనివారం బ్యాగులు అందజేశారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పిల్లందరికీ బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి ఎదగాలను ఆకాక్షించారు. తల్లిదండ్రుల పేరు నిలబెట్టే విధంగా విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలువాలని సూచించారు. రాజశేఖర్ విద్యార్థులకు బ్యాగులను అందజేయడంపై ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తొల్ల సత్తయ్య, నీరుడు కిష్టయ్య, చిట్కుల బాలయ్య, మన్నె నర్సింహులు, కొత్తొల్ల రాజ్‌కుమార్, చిట్కుల నగేశ్, మాసగోని శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న చిన్నరోళ్లపాటి రాజశేఖర్

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో పాండు, తహసీల్దార్ కిరణ్‌కుమార్

చౌటకూర్, ఫిబ్రవరి 22: చౌటకూర్ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు శనివారం పరిశీలించారు. ఈనెల 27న జరగనున్న ఉమ్మడి నిజామాబాద్-ఆదిలాబాద్, కరీంనగర్-మెదక్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు, పాఠశాలలో తరగతి గదులను ఆయన పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులైన విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీవో వెంట స్థానిక తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తదితరులున్నారు.

ఎస్పీ రూపేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి

విద్యార్థులు శ్రద్ధతో చదవాలి

ఎస్వీ కళాశాల వేడుకల్లో ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 22: విద్యార్థులు సీరియస్‌గా కాకుండా శ్రద్ధతో చదవాలని ఎస్పీ రూపేశ్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్వీ జూనియర్ కళాశాలలో పెర్వేల్ వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరగలుగుతారని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దన్నారు.హెల్మెట్ లేకుండా నడపడంతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదని వ్యక్తం చేశారు. వేడుకల్లో యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో రజతోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న సలోమాన్‌రెడ్డి

సెయింట్ ఆంథోనీస్‌లో రజతోత్సవ వేడుకలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 22: శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో శనివారం రెండో రోజు రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత సలోమాన్‌రెడ్డి జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను ఏర్పాటు చేసి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్య ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ఎదుగుదలకు సమయాన్ని ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డపోతారం మున్సిపల్ మేనేజర్ మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మాధారం గ్రామస్తులు

శివరాత్రికి సేవలందించాలి

జిన్నారం, ఫిబ్రవరి 22: శివరాత్రి ఉత్సవాలకు మున్సిపాలిటీ సేవలు అందజేయాలని గడ్డపోతారం మున్సిపాలిటీ మేనేజర్ మధుసూదన్‌రెడ్డిని మాదారం గ్రామస్తులు కోరారు. శనివారం గడ్డపోతారం మున్సిపాలిటీ కార్యాలయంలో మాదారం మహా శివరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహా శివరాత్రి పండుగను మాదారం గ్రామంలో ఘనంగా జరుపుకొంటామన్నారు. దుర్గాభవానీ అమ్మవారి పూజలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దుర్గా భవానీ అమ్మవారిని దర్శించుకుంటే అన్ని రకాల కోరికలు తీరుతాయని భక్తులు నమ్ముతారన్నారు. వేలాదిమంది భక్తులు వస్తారని, మున్సిపాలిటీ తరపున పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఇతర సేవలు అందించాలని వారు కోరారు. సోమవారం అంకురార్పణ, పుట్ట బంగారం, మంగళవారం అమ్మవారి ఉరేగింపు, బుధవారం సత్యనారాయణ కథ, గురువారం పుర్ణాహుతి, అన్నదాన ం, శుక్రవారం అవబృత స్నానం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాజ్‌పుత్ అధ్యక్షులు లక్ష్మణ్‌సింగ్, భజరంగ్ సింగ్, కిశోర్ సింగ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి నగదు, నగలు మాయం

అందోల్, ఫిబ్రవరి 22: బంధువుల పెండ్లికి ఊరెళ్లి వచ్చే సరికి ఇంట్లో ఉన్న నగలు, నగదును మాయం చేసిన ఘటన జోగిపేటలో చోటుచేసుకుంది. వరుసగా కొద్ది రోజులుగా తాళం వేసిన ఇండ్లనే టార్గెట్ చేస్తున్న దొంగలు శుక్రవారం రాత్రి మరోసారి చేతివాటం చూపెట్టారు. జోగిపేటలోని మల్లన్నకాలనీకి చెందిన కటికే మహేశ్ ఇంటికి తాళం వేసి బుధవారం కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో పెండ్లికి వెళ్లారు. శనివారం తిరిగి రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ అనిల్‌కుమార్, ఎస్సై పాండు బాధితుడి ఇంటికెళ్లి వివరాలు సేకరించారు. దొంగలు తులం బంగారం, 20 తులాల వెండి, రూ. 20వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాయికోడ్‌లో చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచరు

ప్రైవేట్ పాఠశాలలు వద్దు..అంగన్‌వాడీ కేంద్రాలు ముద్దు

రాయికోడ్, ఫిబ్రవరి 22: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి చిన్నారిని తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని రాయికోడ్ మొదటి అంగన్‌వాడీ సెంటర్ టీచరు సక్కుబాయి అన్నారు. శనివారం రాయికోడ్ మొదటి సెంటర్‌లో ఈసీసీడే సందర్భంగా అవగాహన కార్యాక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....మూడేండ్లు నిండిన చిన్నారులను తల్లిదండ్రులు తప్పకుండా అంగన్‌వాడీ కే